

"అమ్మాయిగారు ఈ స్వీట్లు ప్యాకెట్లు తిప్పి పంపారమ్మా! ఈ కవరు మీకివ్వమన్నారు!" నౌకరు సీతన్న వినయంగా చెప్పి, టీపాయ్ మీద స్వీట్ల ప్యాకెట్లు ఎర్ర రంగు కవరు పెట్టాడు.

సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న సుభద్ర త్రుళ్ళిపడింది. టీపాయ్ మీద వున్న స్వీట్ల ప్యాకెట్లు పెద్ద కొండలా కనిపించింది! ఎర్ర రంగ కవరు ఓ మనిషిని పాశవికంగా హత్యచేసినపుడు చిందిన రక్తపు మరకల్లా.... భయంకరంగా తోచింది.

"సర్లె! నువ్వెళ్ళి నీ పని చూసుకో!" అంది సీతన్నతో. అతగాడు వంగి, నాలుగడుగులు వెనక్కి వెనక్కి నడిచి, తర్వాత వెళ్ళిపోయాడు మామూలుగా. అంతటి బాధలోనూ సుభద్రకు నవ్వొచ్చింది. డబ్బున్న యజమానులను తృప్తిపరచటానికి, అతి వినయం ప్రదర్శించటానికి నౌకర్లు ప్రదర్శించే ఈ "తిరోగమన నక్కవినయం" బహుశా నవాబుల కాలంలో ప్రవేశపెట్టబడిన సాంప్రదాయం అయివుండవచ్చు.

"ఏమిటి? ఆ మహారాణిగారు స్వీట్స్ తిప్పి పంపిందటనా?" అందాకా హాలు పక్క గదిలో వున్న కోడలు సుమలత వెటకారంగా అంటూ వచ్చింది.

"లక్షణంగా మనం తిందాం! అందునా ఏం 'స్వీట్ స్టాల్స్' నుంచి తెప్పించినవీ కావు. మీరు స్వయంగా ఎంతో శ్రమపడి, స్వచ్ఛమైన మన ఇంటి గేదె నెయ్యితో చేసినవి. ప్రాప్తం ఉండాలి అత్తయ్యా! తినటానికీ, అనుభవించటానికీ ప్రాప్తం ఉండాలి" అంటూనే స్వీట్స్ ప్యాకెట్టు కవరు గబగబ చింపి, అట్టపెట్టె మూత తీసి అప్పటికప్పుడే జిలేబీ నోట్లో వేసేసుకుంది సుమలత. అప్పుడే మేడ మీద నుంచి వస్తున్న కొడుకు శంకరం నవ్వుతూ "దీపావళి రోజు ఉదయాన్నే స్వీట్లు మింగేస్తున్నావేమిటి లతా! భర్తకు స్వీట్లు పెట్టకుండా స్వీట్లు తిన్న భార్య ఏ రౌరవాది నరకాలలో పడుతుందో నీకింకా పురాణాలు మా అమ్మ చెప్పలేదేమిటి?" అన్నాడు.

"ఏ నరకాల్లో పడినా ఫర్వాలేదు గానీ స్వీట్లు కనిపిస్తే తినకుండా ఉండటం నా వల్ల గాని పని! రండి. మీకూ పెడతాను" మరో జిలేబీ అతగాడికి ఇచ్చింది. తినేశాడు' ఇద్దరూ చెట్టాపట్టాలేసుకుని "అమ్మా, మధ్యాహ్నం ఏ ఒంటిగంటకో తిరిగొస్తాం ఇద్దరం. టపాకాయలు కొనుక్కొని ఫ్రెండ్సందర్నీ రాత్రి డిన్నర్‌కు పిలిచి... నువ్వూ, నాన్నగారూ భోజనం చేసెయ్యండి" అన్నాడు శంకరం. మరో రెండు నిమిషాల్లో వాళ్ళ కారు కదిలి వెళ్ళిపోయింది.

ఊడదీసిన స్వీట్ల ప్యాకెట్టు అందులో జిలేబీలు, లడ్డూలు, పాలకోవా....


సుమలత కంట పడకుండా వాటి ఎర్రని కవరు మెల్లగా చింపింది. చిన్న కాగితం.

దీపావళి రోజు నాకు స్వీట్లకేంకొదవ ఎన్నిబుట్టలతో ప్యాకెట్లతో వచ్చాయో ఆపిల్సూ...స్వీట్లూ....! అన్నీ ఇక్కడ పిల్లలందరికీ పంచిపెడుతున్నాను. మరెప్పుడూ ఏవీ పంపవద్దని మనవి... కింద సంతకం లేదు....

సుభద్ర సోఫాలో వెనక్కివాలి కళ్ళు మూసుకుంది. దుర్గ కనిపిస్తోంది సూటిగా కళ్ళలోకి చూస్తోంది. ఆ కన్నులు అగ్ని కురిపిస్తున్నాయి....సుమారు ఇరవై సంవత్సరాల క్రితం .... ఇ

# నీడలా - నిజాలా!

పవని నిర్మల ప్రభావతి



దీపావళి పండుగ వారంరోజుల ముందనగా.. అప్పట్లో ఇంతటప్పులేదు. శోదాలేదు. కార్డు బంగారాలు లేవు....ఆమె నేత్రాల ముందు గతం సినిమారీలులా కనిపిస్తోంది.

భర్త రాఘవరావు ఓ ఆఫీసులో గుమాస్తాగా ఉద్యోగం చేస్తుండేవాడు.. సాయంత్రం ఆరుగంటలైనా భర్తరాలే. ఆ రాత్రి బాగా పొద్దుపోయాక రాఘవరావు వచ్చాడు. ఫ్రెండ్సు బలవంతపెట్టి సినిమాకు పిల్చి కెళ్లారనీ, వెళ్ళక తప్పలేదనీ, వెయ్యి క్షమాపణలు చెప్పుకున్నాడు. సుభద్రకు కోపం చల్లారలేదు....

రాఘవరావే అన్నాడు. "చూసుసుభద్ర! నీకు వంటరితనం. నాకు ఉద్యోగం, సాంఘికపరమైన కొన్ని బాధ్యతలూ తప్పని సరి. నీకు ఒకటే సమస్య: పిల్లలే కపోవటమున్నది. నాకు జీవనపోరాటం. పరువు ప్రతిష్ఠ ఎన్నో సమస్యలున్నాయి. ఈ సమస్యకు ఓ పరిష్కారం కావాలి. డాక్టర్లు మనిద్దరిలో ఏ లోపం లేదంటున్నారు. అయినా పిల్లలు పుట్టలేదంటే మనం చేయగలిగిందేమీ లేదు....ఓ బిడ్డని పెంచుకుందాం...రేపు అనాధశరణాలయం వెళదాం.."

సుభద్రకిదెంతో నచ్చింది. మర్నాడు ఉదయం ఇద్దరూ అనాధశరణాలయానికి వెళ్లారు. పిల్లలందర్నీ చూశారు. సోగకళ్ళతో తెల్లగా, సన్నగా, వున్న ఆరేళ్ళపాప చాలా నచ్చింది ఇద్దరికీ. మిషనరీ "నన్"వచ్చింది.

"ఈ పాప నచ్చిందా మీకు? సరే! ఆకారపుష్టి. మాటలురావు. ఎంతోకష్టంమీద చిన్న చిన్న మాటలు "అమ్మా....అక్క.... అన్న...." ఉచ్చరించగలదు .... ఎలాగూ ఇంట్లో పనిపాటలకోసమే కదా పిల్చికెళ్తున్నారు. నేర్పుకోండి...." అంది. ఆ చెప్పటంలో ఆ పాప లెవరో తనకేమీకారన్న నిర్లిప్తత నిండివుంది. కులం, మతం, తల్లి, తండ్రి ఏమీ తెలియని ఆ పాపల్ని పెంపకానికి ఇష్టపడరనీ, పనిపాట్లకు నమ్మకమైన పనివాళ్ళగా మాత్రమే వాడుకుంటారనీ నగ్నసత్యం నిండివుంది....

"మూగపిల్లా?" ఇద్దరూ నిరాశపడ్డారు.. అంత చక్కటి కళ్ళు, చక్కటిమొహం.... మాటలురాని, చక్కని బుల్లినోరు....

"ఏం మాటలు రాకుంటే ఏం ? చెప్పిన పని చక్కగా గ్రహించివేస్తుంది. నాకిదెంత సాయమో పనిలో...." అందావిడ మళ్లీ. శరణాలయంలోంచి ఓ పిల్లపోయినా పోయినట్లే...పీడా విరగడైనట్లు అన్నట్లుంది ధోరణి.

రాఘవరావే అన్నాడు మెల్లగా "పోనీ సుభద్ర! ఓ మూగపిల్ల .... ఇక్కడి విసుగులో నిర్లక్ష్యం నుంచి బయటపడేసిన పుణ్యం అయినా దక్కుతుంది మనకు. నీకు పనిమనిషి లేక ఇబ్బంది పడుతున్నావు కదా? రోజంతా తోడుగానూ వుంటుంది నీకు. మనం ఎక్కడికేనా వెళ్ళాలంటే, ఇంటికాపలాగానూ వుంటుంది. ఏమంటావు ?"

"అలాగే" అంది సుభద్ర. భయం భయంగా వాళ్ళవెంట వచ్చింది ఆ పాప... శరణాలయంలో పేరేదేనాకానింది ... దుర్గ అంటాను నేను. నాకాపేరు చాలా ఇష్టం" అంది సుభద్ర ఇంటికి రాగానే.

"నీ ఇష్టం. ఏపేరుతోనైనా పిలువు, కానీ ఆ పిల్లకి కడుపునిండా అన్నం. పరిశుభ్రత...పిసరంత ప్రేమ. కంటినిండా నిద్రపోయే అవకాశం ఇవ్వు చాలు కనీస మానవత్వం అది...." అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

"అయ్యయ్యో! అదేమన్నమాట? చక్కగా మన స్వంత బిడ్డలా చూచుకుంటాను చూడండి!" అంది సుభద్ర రోషపడ్తూ.

రెండు రోజుల్లోనే దుర్గ ఈ కొత్త వాతావరణానికి అలవాటు పడింది. సుభద్రకు చిన్నచిన్న పనులన్నిటిలోనూ సాయం చేస్తోంది. దీపావళి రేపనగా, నరకచతుర్దశి సాయంత్రం సుభద్రచేసే పిండివంటలకి పిండి జల్లించటం నుంచి, లడ్డు కట్టడం వరకు అన్నీ చేసింది. దీపావళిరోజు రాఘవరావు పదిమంది స్నేహితుల్ని పిల్చుకు వస్తాడు ఎప్పుడూ....దుర్గ చకచక గ్లాసులతో మంచినీళ్ళు అందించింది. ప్లేట్లలో సర్దిన టిఫిను అందరికీ అందించింది. టీ కప్పుల ట్రే జాగ్రత్తగా అందరి మధ్య పెట్టింది. చిన్న చిన్న ఎర్ర పువ్వులున్న తెల్లని మెట్లమెట్ల కొత్తగౌను వేసుకుని. ముద్దుగా మౌనంగా ఆ పిల్ల అలా అన్ని పన్లూ చేస్తుంటే అందరూ మెచ్చుకున్నారు.

"మాకూ ఇంతమంచి పనిపిల్లదొరికితే బావుణ్ణు....కానీ మీలా పదివేల డిపాజిట్ చేసేశక్తి లేదు మాకు!" అన్నారంతా. సుభద్రకి చాలా ఆనందం వేసింది. దుర్గ మూగపిల్లే గానీ చాలా తెలివిగలది....

మరో దీపావళికి అనుకోని అదృష్టం కలిసివచ్చింది. మధ్యప్రదేశ్‌లో ఓ స్నేహితుడు కాంట్రాక్టరుగా స్థిరపడి, రాఘవరావునూ తనతోబాటు కాంట్రాక్టులలోకి ఆహ్వానించాడు. రాఘవరావు! సుభద్ర.... దుర్గ వెళ్ళారు. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు రాఘవరావు. ఆ వేళావిశేషం ఏమిటో రాఘవరావుకు పట్టిందల్లా బంగారమైంది. మూడు దీపావళులు తిరిగేసరికి రాఘవరావు లక్షాధికారి అయ్యాడు. పదేళ్ళ దుర్గ తెచ్చిన అదృష్టంగా భావించారు ఇద్దరు. దుర్గకు ట్యూటర్‌ని పెట్టారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, లెక్కలు అన్నీ రాస్తుంది....ప్రశ్నలు జవాబులూ కూడా రాస్తుంది ... పదిహేనేళ్ళు వచ్చేసరికి డైరెక్టుగా మెట్రిక్‌కు కట్టించారు పాసైంది.

ఆంధ్రాకు తిరిగి వచ్చారు. విశాఖపట్నంలో బ్రహ్మాండమైన బంగళా, కారు, పెద్ద సినిమాహాలు ఏర్పరచుకున్నారు. ఇంటినిండా నౌకర్లున్నారు. దుర్గ ప్రైవేటుగా ఇంటర్ పాసయింది. నౌకర్లందరూ "అమ్మాయిగారనే అంటారు, రాఘవరావు రోజులతరబడీ వ్యాపారవిషయాలలో మునిగివున్నా సుభద్రకేం బాధలేదు. దుర్గతో కాలక్షేపం అయిపోతుంది.

ఆ సమయంలోనే సుభద్ర చెల్లెలు రాధ భర్త చనిపోయాడు. తాగుడుతో ఉన్న ఆస్తి తగలబెట్టేసి, ఉద్యోగం పోగొట్టుకుని, నలుగురు పిల్లల బరువు రాధనెత్తిమీద పెట్టి మరీ చచ్చాడామహానుభావుడు. పిల్లలతో రాధ వచ్చింది. మూడోవాడు పన్నెండేళ్ళ శంకరం "అక్కా! వీడికి చదువుమీద శ్రద్ధ వుంది. నువ్వు పెంచుకుని చదివించవే! వాడొక్కడైనా పైకి వస్తాడు" అంది.

సుభద్ర రాఘవరావుతో ఆలోచించింది. "పోన్లే సుభద్ర! ఇంత కలిమి ఉంది ఒక బిడ్డ చదువు భారం కాదు మనకి.... ఉండనీ! మిగతా పిల్లలకి, రాధకి కూడా దిగుల్లేని ఏర్పాటు ఏదో చేస్తాను. వీణ్ణి మన దగ్గరే ఉంచుకుందాం." అన్నాడు.


సుభద్ర చాలా సంతోషించింది. దుర్గలానే వీడు కూడా తనకెంతో సాయం అనుకుంది. కానీ అలా జరుగలేదు.

శంకరం వచ్చిన వారం రోజుల్లోనే దుర్గ తనకు స్వంత "అక్క" కాదని తెల్చేశాడు. ఆ పిల్ల స్థాయి పనిపిల్ల స్థాయే గాని తన స్థాయి కాదన్నాడు. ఆ అమ్మాయి అలా ఇంట్లో అన్ని రకాల హక్కులు పొందటం అందరి ఫోమ్‌బెడ్స్ మీదా పడుకోవటం లాంటివి సహించలేకపోయాడు. ఫలితంగా శంకరాన్ని ఇంటికి పంపేసింది సుభద్ర. వారం తిరక్కుండా రాధ మళ్ళీ వాణ్ణి వెంట బెట్టుకు వచ్చింది,

పసివెధవ! తెలిసీ తెలియని వయసు. ఆ వయసులో సహజంగా తోటి పిల్లల పట్ల ఉండే ఈర్ష్యతో వాడలా ప్రవర్తించాడు నేనువాడిని చీవాట్లేశాను. నచ్చచెప్పాను. ఇక ఎప్పుడూ దుర్గ విషయంలో దురుసుగా ప్రవర్తించడువాడని నీకు మాట ఇస్తున్నక్కా! "అంది కన్నీళ్ళతో... కార్యసాధకురాలు రాధ... శంకరమూ క్షమించమ్మా! అన్నాడు సుభద్రతో శంకరంతో తర్వాత పేచీయే లేదు దుర్గను అక్కగానే గౌరవించటం అలవర్చుకున్నాడు. అయితే ఆ పిల్ల పట్ల అంతరాంతరాలలో ఆతగాడికి ద్వేషం. జలసీ వున్నాయన్నది సుభద్రకు తెలియలేదు. కాల ప్రవాహం జలజల సాగిపోతుంది. శంకరం ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేశాడు. రాఘవరావుతో బాటు బిజినెస్ చేస్తున్నాడు.

ఐదు లక్షల కట్నంతో సుమలత కోడలుగా వచ్చింది.

ఆ వివాహానికి ముందే సుమలత తండ్రి శ్రీనివాసరావు గడుసుగా ఓమూక్క అడిగాడు "రాఘవరావు బావగారూ! దుర్గని పెంచుకున్నారు. ఆమె ఆడపిల్ల, ఎప్పుడో మంచి సంబంధం చూచి పెళ్ళిచేసి పంపేస్తారు మీరు.... పేచీలేదు" కానీ శంకరాన్నిపుట్టించినట్టు లానే మరో కుర్రాణ్ణి పెంచుకుంటే అప్పుడు



చిక్కులొస్తాయి.... మీరు శంకరానికి ఇవ్వదల్చుకుందేదో స్పష్టంగా చెప్పేస్తే... తర్వాత పేచీలుండవు. మీకూ, మాకూ మధ్య అనవసరమైన అపోహలుండవు. మాకు ఒక్కర్తే అమ్మాయి!"

రాఘవరావు నవ్వాడు. 'మరొకర్ని పెంచుకొనే ఉద్దేశ్యం నాకులేదు.... అయినా మీరన్నదీ నిజమే కాబట్టి - నాకూ సుభద్రకూ పోషణకు వాటా! దుర్గ పెళ్ళికి ఆమె జీవితానికీ వాటా పోను... మిగతా అంతా శంకరం పేరుతో రిజిష్టర్ చేస్తాను. మీరన్నట్లు ఏ పేచీ ఉండదు." అన్నారు.

అలాగే చేశాడు. దుర్గ బి.ఏ పాసైంది. ప్రైవేటుగా. దుర్గ మూగపిల్ల... డబ్బు కోసం ఆమెని పెళ్ళాడేవాడుగాక.... ఆమెను ఆమెగా ప్రేమించే కుర్రాడి కోసం అన్వేషిస్తున్నాడాయన...

సుమలత కాపురానికి వచ్చింది..


ఇక్కడే మొదలైంది. అసలు కథ. శంకరం ద్వారా దుర్గ గురించిన వివరాలన్నీ సేకరించింది. దుర్గ కోసం.... ఒకప్పుడు శంకరాన్ని వెళ్ళగొట్టిన అత్తగారి ప్రేమ దుర్గ పట్ల ఎంతటిదో అంచనా వేసుకుంది.

అందుకే అందరూ డైనింగ్ టేబిల్ చుట్టూరా కూర్చొని కలిసే భోజనాలు చేసే వాళ్ళు.... నెల తిరిగేసరికి సుమలత కొత్త పద్ధతి పెట్టేసింది.

తాను తన భర్త మాత్రం కూర్చోవాలి. లేదా ఇద్దరూ మేడ మీదకే తెప్పించుకుంటారో నౌకరుచేత....

యూ బ్రూట్! భార్యాభర్తలు కూర్చొని ఉన్నప్పుడు బెడ్‌రూం లోకి రావద్దని ఎన్ని సార్లు చెప్పాలి నీకు? మా బెడ్స్ మీద కూర్చోవటం! పడుకోవటం అనాగరీకం అని తెలీదు? మా వెంట నువ్వు సినిమాకు రావటమేమిటి? షికారుకు రావటమేమిటి? అత్తయ్యగారి దగ్గరుండాలి నువ్వు ఇలా అస్తమానం ఏదో ఓ సాకుతో తరిమి వేస్తోంది.....దుర్గ విభ్రాంతపోయి చూస్తుంది.

సుభద్రకు దిక్కుతోచటంలేదు. కోడలు ఓ ప్లాను ప్రకారం దుర్గని దూరంగా తోసేస్తుందనీ తెలుసు. అలాగని వాళ్ళిద్దరి వెంట దుర్గని ఏ విషయంలోనూ సన్నిహితంగా వుంచేందుకు. వీల్లేదని తెలుసు.... పెళ్ళిచేసి పంపేద్దామంటే దుర్గ కులం




మతం — మూగతనం లెక్కపెట్టుకొని మంచితనంగాక వాటిని కేవలం "డబ్బు మూట"తో సహించగల మనస్తత్వాలే ఎదురౌతున్నాయి.... తొందరపడి లాభంలేదు. మానవత్వం గల కుర్రాడు. పెద్దలకూ సంఘానికీ భయపడని ధీమంతుడూ, ఇచ్చిన డబ్బు సద్వినియోగం చేయగల వివేకీ దొరకాలి! అందుకు టైం కలిసి రావాలి.

దీపావళి వచ్చింది. ఎప్పటిలానే సుభద్ర పక్కన నిల్చుని దుర్గ సాయం చేస్తోంది. స్వీట్ల తయారీలో....వంటమనిషి చేస్తోంది.

దుర్గా! నువ్వెళ్ళి ఏదేనా చదువుకో. నేను చేస్తాను సాయం అత్తయ్యగారికి... నేను నీలానే అత్తయ్య గారి దగ్గర ట్రైనింగ్ కావాలి కదా? వచ్చే ఏడాదికి అత్తయ్య గారికి రెస్ట్ ఇచ్చి... నేనే చూచుకుంటాను. ఇంటి బాధ్యతలన్నీ"! అంది... దుర్గ క్షణకాలం నిర్ఘాంతపోయింది. సుభద్ర కూడా నిర్ఘాంతపోయింది. శంకరాన్ని ఒకనాడు వెళ్ళిపొమ్మనంత తేలిగ్గా సుమలతను వెళ్ళిపొమ్మనేందుకు తనకు హక్కు లేదు. కారణం ఆమె తనలానే తనింట్లో అడుగెట్టిన కోడలు. ఈ ఇంట్లో తనకెంత హక్కు అధికారం వుందో ఆ పిల్లకీ అంతే ఉంది... తను ఏ మాత్రం మాట తూలినా "సగటు అత్తగార్ల జాబితా" లోకి ఎక్కిపోయి బంధువులలో, స్నేహితులలో, చివరకు నౌకర్లలో కూడా హేళనకూ విమర్శకూ గురౌతుంది. ఇందాక "సుభద్ర చాలామంచిది! చాలా గొప్ప సంస్కారవంతురాలు. విశాల హృదయురాలు "అన్నవాళ్ళే" సుభద్ర వట్టి నటన తెచ్చి పెట్టుకున్న సంస్కారం. చాకిరీ కోసం దుర్గని చేరదీసిందంతే! కోడల్ని కోడరికం పెట్టే సాధారణ తెలివిమాలిన అత్తగాక" అంటూ విమర్శిస్తారు....

దుర్గ క్షణకాలం "అమ్మ"కేసి చూచింది. ఆమెలో చలనంలేదు. కోడల్ని వారించే ప్రయత్నం లేదు...దుర్గ మెల్లగా తన రూంలోకి వెళ్ళిపోయింది, సుమలత నవ్వుతూ తో ఖుషీతో అత్తగారికి సాయంచేసింది,

మర్నాడు దీపావళిరోజు వచ్చిన అసంఖ్యాకమైన స్నేహితులకూ, బంధువులకూ, శంకరం, సుమలత స్వీట్సు అందించారు. నౌకర్లు వుండనేవుండె.

దుర్గ గదిలోంచిరాలేదు. ఒళ్ళు బాగా లేదని సైగలద్వారా చెప్పింది.

సుభద్రకు తెలుసు...దుర్గ ఇప్పుడా బంగళాలో ఎక్స్ట్రా! ఎవరిలో ఇమిడే వయసూ, పరిస్థితీ కాదామెది.

రాఘవరావు బిజినెస్ పనుల్లో రోజులో ఎక్కువభాగం బయటవుంటాడు. ఏరాత్రి వేళో రెండు చపాతీలు తిని, విశ్రాంతి తీసుకుంటాడు.

సుభద్ర పక్కన సుమలత వుండటం దెప్పుడూ. వంటమనిషి నౌకర్లూ వుంటారు అన్ని పనులకూ. శంకరం, సుమలత బయ

టకు వెళ్ళినపుడు సుభద్రకు పెరుగుతున్న వయసుతోబాటు ఆధ్యాత్మిక గ్రంథాలపట్ల పూజలు, జపాలపట్ల ఆసక్తి హెచ్చుతోంది. ఒకప్పుడు తన వంటరి తనకు బాధాకరం అనిపించిన ఆవిడకిప్పుడు వంటరిగా తన లోకితాను చూచుకుంటూ వుండటే బావుంటోందనిపిస్తోంది. దుర్గతో చెప్పే కబుర్లేమున్నాయి? దుర్గ చేసేపనులేమున్నాయి? మరో దీపావళి వచ్చింది....

సుమలత ఇప్పుడు సర్వాధికారిణి. లాంఛనంగా అత్తగారిని స్వీట్ల తయారీలో సలహా అడుగుతోందంతే! వంట ఇంట్లో సుభద్ర వుందన్న పేరేగానీ సుమలత, వంట వాళ్ళద్దరిచేతా చేయించింది స్వీట్లన్నీ

దుర్గ బాగా అప్‌సెట్ అయింది.

రాఘవరావుగారితో వారం క్రితం ఓ రాత్రి చూచాక ఈ విషయాలన్నీ చర్చించిందామె...

"ఇక దుర్గ, లత కలిసివుండటం సాధ్యపడేలా లేదు. నౌకర్లు, బంధువులు అసహ్యంగా మన ఇంటి గురించి మాట్లాడుకోకముందే ఏదో ఓ పరిష్కారం చూడాలి" అంది.

రాఘవరావుగారు చాలాసేపు ఆలోచించారు. తర్వాత మెల్లిగా అన్నారు. "నాకూ బాధగానే వుంది సుభద్రా! ఈ హక్కులన్నవి చూశావా! ఒక్కోసారి చాలా అమానుషంగా వుంటాయి...దుర్గకోసం... నేనే ఓ అనాథ శరణాలయాన్ని మొదలెట్టిస్తాను. దుర్గ ఆ శరణాలయాన్ని "మేనేజ్" చేస్తుంటుంది, ఆ పిల్లలతో, వ్యాపకంతో పొద్దుపోతోందామెకు. తగిన వరుడు దొరకగానే పెళ్ళి చేద్దాం. కారు, బంగళా అన్ని వసతులకూ డబ్బు కేటాయిస్తాను. వారంలోగా అన్నీ సెటిల్ చేస్తాను!" అన్నారాయన.

అన్నట్టే చేశారు...

నరకచతుర్దశి తెల్లారేసరికి సుమలత దుర్గమీద ఏదోసాకుతో పోట్లాట వేసుకుంది.

ఒకరు మాటలు నేర్చిన హక్కున్న వ్యక్తి.

మరొకరు మాటలురాని... హక్కుల్లేని మూగప్రాణి.

విజయం ఎప్పుడూ అతిమాటలా, అతి హక్కు, అతిడబ్బు వేపేవుంటుంది సహజంగా....అదే జరిగిందిప్పుడూ

"అత్తయ్యా! మీరే నిర్ణయించండి. ఈ ఇంట్లో నేనుండాలో...దుర్గవుండాలో... మీరు పెద్దలు...మీ నిర్ణయం ఎలాటిదైనా... నేను కట్టుబడి వుంటాను." అంది సుమలత కోపంగా.

సుభద్ర నెత్తిమీద పిడుగుపడ్డట్లైంది. ఆమె మౌనంలోనే నిర్ణయం నిర్దేశింపబడిపోయింది.

ఆ సాయంత్రమే కొత్త అనాథశరణాలయం బాధ్యత స్వీకరించినట్లు స్నేహితులందరి ఎదుటా చెప్పి, ఆ బాధ్యత ఆమెకు అప్పగించారు సుభద్ర, రాఘవరావుగార్లు, దుర్గ, ఆమెకు అవసరమైన సామాన్లు కొన్ని అనాథశరణాలయం మేడలోని పెద్ద గదిలోకి మార్చబడ్డాయి. అక్కడా నౌకర్లున్నారు. వంట మనుషులున్నారు. దుర్గ ఆజ్ఞలకు తిరుగులేదు, దుర్గ సర్వాధికారిణి. అందరూ సంతోషించారు. రాఘవరావు సుభద్రల వితరణకు, వివేకానికీ మెచ్చుకున్నారు. సుమలత అత్తగారి ఔదార్యాన్ని, గొప్పగుణాల్ని మెచ్చుకొని, "మంచికోడలు" అనిపించుకొంది అందరితో.

ఆ రాత్రి స్వీట్ల తయారీలో సుభద్ర వంటింట్లో కుర్చీమీద కూర్చొంది. ఆమె కళ్ళముందు షుమారు ఇరవై సంవత్సరాలు దుర్గ వివిధ వయసుల్లో తనతో బాటు పాల్గొన్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. "జిలేబీ అద్భుతంగా కుదిరిందత్తయ్యా? మీరు స్వయంగా పాళ్ళు కలిపితే కుదరనిదేముంది?" అంటోంది సుమలత. వంట వాళ్ళు చేసిన జిలేబి, లడ్డు పాలకోవా, కేకులని జాగ్రత్తగా ప్యాకెట్లు కట్టిస్తోంది ఆమె చురుగ్గా.

తెల్లారగానే స్వీట్ల ప్యాకెట్లు దుర్గకి పంపింది సుభద్ర...అక్కడ దుర్గకూడా వంటమనిషిచేత స్వీట్లుతయారుచేయించింది. సుభద్ర పంపిన స్వీట్ల ప్యాకెట్లు తిప్పి పంపింది చిన్న ఉత్తరం ముక్కతో...... "అమ్మా!" శంకరం పిలుపుతో త్రుళ్ళిపడింది.

గతం చెదిరింది. వర్తమానంలోకి వచ్చింది. సుమలత శంకరం వచ్చారు షాపింగ్ పూర్తయి...

ఆ రాత్రి యధావిధిగా స్నేహితులు రావటం, గొప్ప డిన్నరూ, స్వీట్లు పంచటం... టపాకాయలు కాల్చటం లాంటి వేడుకలు బంగళా దేదీప్యమానంగా వెలిగిపోతుండగా జరిగిపోతోంది. సుభద్ర మౌనంగా తన గదిలో కూర్చొని వుంది. సుమలతకామె ఎందుకలా వుందో తెలుసు...కానీ తెలియనట్లే తన పనిలోతాను మునిగిపోయింది. అనుకున్నది సాధించుకొన్నావ్, ఆమెతో మాట్లాడాల్సిన మాటలంటూ ఏమీలేవని తెలుసు.

రాత్రి దీపావళి అమావాస్య. అమావాస్య గాఢాంధకారాన్ని పారద్రోలుతూ ఇంటింటా వెలుగుల వెల్లువ...

"అమ్మా! నేను నీ స్వీట్లు కోరలేదు. నీ ఐశ్వర్యం కోరలేదు హక్కులు కోరలేదు. నీ కుటుంబంలో ఓ వ్యక్తిగా, నీ హృదయంలో కాస్తంత చోటు మాత్రం కోరాను. అది ఇవ్వలేకపోయావు.

"నేనో, దుర్గో ఎవరుండాలో నిర్ణయించండి!" అని సుమలత కోరినప్పుడు "ఇద్దరూ నాకు కావాలి" అన్న ఒక్కమాట నీ నోటినుండి వెలువడలేదు. నాకు మాటలు రాని మూగతనం...నీకు మాటలు వచ్చీ మూగతనం ఆవహించింది. ఆ క్షణంలో నాకర్థమైంది...

మీలో ఎవరికీ నేనేమీ కాను...

అందరికీ ఓ సమస్యను. ఎక్స్‌ట్రాని! నా హృదయం శూన్యమైపోయింది. నాన్నగారు నిర్ణయించినట్లు...అనాథశరణాలయ బాధ్యత స్వీకరించాను...కేవలం మీకు సమస్యగాకుండా దూరంగా తొలగటానికే, ఇన్నేళ్ళు కొన్ని నిజాలు...నీడలమాటున దాక్కున్నాయి. ఈనాడవి నీడలువదిలి ప్రత్యక్షంగా కనిపించాయి."

దగ్గర్లో మాటలురాని దుర్గ హృదయం మెల్లిగా పలుకుతూన్న అనుభూతి. సుభద్ర కళ్ళు మూసుకుంది. ఆరాత్రి ఎంతకూ తెల్లారటంలేదు. ఆ చీకటి ఎన్ని దివ్వెలకూ తొలగిపోవటంలేదు.

వంటరితనం తిరిగి ఆవహించి శూన్యమైన ఆమె హృదయం! నీడలను తొలగించుకుని వచ్చిన నిజాలకు తట్టుకోలేకపోతోంది.

తెల్లారి "సుభద్ర మరణించింది!" అని తెలిసినప్పుడంతా "అహా! ఎంత పుణ్యాత్మురాలు! ఎంత గొప్ప మరణం! ఏ బాధా లేకుండా, నిద్రలాగా ఎంత గొప్ప మరణం పొందిందావిడ!" అనిపొగుడుతున్నారంతా!